News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :255 | ఖమ్మం | శనివారం అక్టోబర్ 25, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# 'నిప్పురవ్వల' మృత్యుకేళి



- కర్నూలు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం
- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- బైక్‌ను ఈడ్చుకుపోవడంతో చెలరేగిన మంటలు
- నడిరోడ్డుపై నిలువునా తగలబడిపోయిన బస్సు
- హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతుండగా దుర్ఘటన
- 19 మంది ప్రయాణికుల సజీవ దహనం
- ద్విచక్రవాహనదారుడూ దుర్మరణం
- డ్రైవర్ నిర్లక్ష్యమే వారికి మరణశాసనం





- ఏసీ స్లీపర్ బస్సు
- బయటంతా ముసురు
- వెచ్చగా దుప్పట్లు కప్పుకొని గాఢనిద్రలో ఉన్నారు ప్రయాణికులు
- కానీ అదే ఆఖరి నిద్ర అవుతుందని.. తమ జీవితం కాసేపట్లో ముగిసిపోతుందని ఆ క్షణం వారెవ్వరికీ తెలియదు
- వాయువేగంతో దూసుకుపోతున్న బస్సులో చెలరేగిన మంటలు..
- తప్పించుకునే దారిలేక ప్రయాణికుల ఆర్తనాదాలు
- మాటలకందని విషాదానికి సాక్ష్యాలుగా మిగిలాయి
- 19 మంది నిండు ప్రాణాలు నిలువెత్తు మంటల్లో బూడిదయిపోయాయి

వివరాలు 2లో..



'కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మరణించినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి పరిహారం అందిస్తాం'. ప్రధాని మోదీ

'కర్నూలు జిల్లాలో బస్సు దగ్ధమై 19 మంది చనిపోవడం తీవ్ర విచారకరం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసదుపాయాలు అందిస్తాం. సీఎం చంద్రబాబు

## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఏఐసీసీ కార్యాలయంలో కీలక సమావేశం

- సమావేశానికి హాజరు కానున్న మహేశ్ కుమార్ గౌడ్, భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల నియామకంపై చర్చించనున్న నేతలు
- రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ముఖ్యమంత్రి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఒక కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి

వివరాలు 2లో..

## నచ్చినట్లు చేస్తామంటే కుదరదు

నిబంధనలు పాటించాల్సిందే

మద్యం దరఖాస్తుల గడువు పొడిగింపులో చట్టబద్ధతేంటో చెప్పాలి

ప్రభుత్వానికి తేల్చి చెప్పిన హైకోర్టు




మద్యం దుకాణాల కేటాయింపు నిబంధనలను రూపొందించి వాటిని ఉల్లంఘించడం ఏమిటని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరించడం కుదరదని, నిబంధనల ప్రకారమే వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది. మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించడానికి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలంది. చట్టబద్ధతలేకుండా

వివరాలు 2లో..

## సుంకాలపై ట్రంప్ బెదిరింపులు.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారతదేశం ఎవరికీ తలొగ్గదని, హడావుడి నిర్ణయాలు తీసుకోదన్న గోయల్
- అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందన్న కేంద్ర మంత్రి
- మరిన్ని సుంకాలు వేస్తామంటే కొత్త మార్కెట్లను వెతుక్కుంటామని హెచ్చరిక



:అమెరికా - భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ ఎవరికీ తలొగ్గదని,

వివరాలు 2లో..




జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరగనున్న ఈ ఉప ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 81 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు కలిపి మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా, 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు.ఇంతమంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే మొదటిసారి. గతంలో 2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది, 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది పోటీ చేశారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతో పాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలో ఉన్నారు.




## అంగన్వాడీ సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం సహించం..

అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవు

అంగన్‌వాడీ సెంటర్లకు సరుకుల సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలమృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరా కొన్ని జిల్లాల్లో 50 శాతానికి కూడా చేరకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగినట్లుగా సరఫరాదారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చి, బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులను ఆదేశించారు.
చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ

వివరాలు 2లో..

## తుపాను ముప్పు .. నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు



రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశముందని పేర్కొంది. తర్వాత సోమవారం నాటికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడుతుందని అంచనా వేసింది. ఇది తుపానుగా మారితే 'మొంథా (మొన్‌థా)'గా ఐఎండీ నామకరణం చేయనుంది. దీన్ని థాయ్‌లాండ్ సూచించింది.

వివరాలు 2లో..

# 'నిప్పురవ్వల' మృత్యుకేళి

కర్నూలు నగర శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి తగలబడిపోయింది. ఈ దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. ద్విచక్రవాహనదారుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. తెల్లవారుజామున అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో బస్సు ప్రమాదానికి గురై మంటలు వ్యాపించడం, డ్రైవర్లు వెంటనే అప్రమత్తం చేయకపోవడంతో ప్రయాణికులు తప్పించుకునే అవకాశం లేక మంటల్లో మాడిమసైపోయారు. కొందరు ప్రయాణికులకు మెలకువ వచ్చినప్పటికీ ప్రమాద తీవ్రతకు బస్సు తలుపులు మూసుకుపోవడంతో అందులోనే చిక్కుకుపోయారు. రక్షించండి అంటూ పెద్దఎత్తున ఆర్తనాదాలు చేసినా కాపాడేవారు కరవయ్యారు. కొందరు అద్దాలు బద్దలుకొట్టి బయటపడగా.. మిగతా వారు పొగకు స్పృహ కోల్పోయి బస్సుతో పాటే బూడిదవడం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదం జరిగే సమయానికి బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 44 మంది ప్రయాణికులు (ఇందులో నలురు చిన్నారులు) ఉన్నారు. ప్రమాదంలో 19 మంది సజీవదహనమవగా.. డ్రైవర్లు, ప్రయాణికులు కలిపి మొత్తం 27 మంది ప్రాణాలతో బయటపడ్డారు. బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం, అగ్నిప్రమాదం జరిగితే ఆర్పేందుకు, ప్రమాదం జరిగితే బయటపడేందుకు ఎలాంటి ఏర్పాట్లు వాహనంలో లేకపోవడం, ప్రయాణికులను అప్రమత్తం చేయకుండా డ్రైవర్లు చోద్యం చూడటం, కనీసం అద్దాలు పగలగొట్టే ప్రయత్నం కూడా చేయకపోవడం.. నిండు జీవితాలను నిలువునా బూడిద చేశాయి.

**బైక్‌ను ఢీకొట్టి.. ఆపకుండా దూసుకెళ్లి**

వేమూరి కావేరి (వి.కావేరి) ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు (డీడీ 01ఎన్ 9490) గురువారం రాత్రి 9.40 గంటలకు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి బెంగళూరుకు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కర్నూలు శివారులోని కల్లూరు మండలం చిన్నటేకూరు దాటిన తర్వాత చెట్లమల్లాపురం గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. కర్నూలు ప్రజానగర్‌కు చెందిన ద్విచక్రవాహనదారు శివశంకర్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్రవాహనం బస్సు కింద ఇరుక్కుపోయింది. వేగంగా దూసుకెళ్తున్న బస్సు సుమారు 200 మీటర్ల దూరం బైక్‌ను ఈడ్చుకెళ్లిన తర్వాత ఆగింది. ఆ రాపిడికి ద్విచక్రవాహనం ట్యాంక్ నుంచి పెట్రోల్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు డ్రైవర్, ప్రత్యామ్నాయ డ్రైవర్ కిందికి దిగి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి బస్సు తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. హైడ్రాలిక్ తలుపుభాగం దగ్గరున్న చిన్నపాటి సిలిండర్ పేలిపోవడం, కింద ద్విచక్రవాహనం ఇరుక్కుపోయిన నేపథ్యంలో వైరింగ్ వ్యవస్థ దెబ్బతినడంతో బస్సు తలుపులు తెరుచుకోలేదు.

**ప్రయాణికుల ప్రయత్నాలు విఫలం**

బస్సు ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకుపోయిన సమయంలో భారీగా శబ్దం వచ్చింది. దీనికితోడు సిలిండర్ పేలడంతో ఆ శబ్దానికి గాఢనిద్రలో ఉన్న కొందరు ప్రయాణికులు డ్రైవర్ క్యాబిన్‌లోకి వచ్చారు. కిందకు దిగాలని తలుపులు తెరిచేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో డ్రైవర్ సీటు పక్కనున్న చిన్న తలుపుల నుంచి బయటకు చూడగా అప్పటికే అగ్ని కీలలు వ్యాపిస్తున్నాయి. వెంటనే కొందరు డ్రైవర్ పక్కనున్న తలుపుల అద్దాలను బద్దలుకొట్టి బయటకు దూకేశారు.

బస్సులోని మరికొందరిని కూడా నిద్ర లేపారు. బస్సు అత్యవసర ద్వారాలు తెరుద్దామని ప్రయత్నించినా అవి తెరుచుకోలేదు. దీంతో నెలకుర్తి రమేశ్ అనే వ్యక్తి తన బెర్తు పక్కనున్న కిటికీ అద్దాన్ని బద్దలు కొట్టారు. అతికష్టం మీద తన భార్య, పిల్లలను కిందకి దింపగలిగారు. ఆ సమయంలో మరో వ్యక్తి బస్సు వెనక అద్దాన్ని బద్దలుకొట్టడంతో అక్కడి నుంచి మరికొందరు బయటపడ్డారు. ఇలా 27 మంది ప్రాణాలు దక్కించుకోగలిగారు.

**పొగకు స్పృహతప్పి.. సజీవ దహనమయ్యారు**

కింద మొదలైన మంటలు క్రమంగా వ్యాపించి బస్సు డీజిల్ ట్యాంకు కూడా అంటుకుంది. దీంతో ఒక్కసారిగా అగ్నికీలలు బస్సును చుట్టుముట్టాయి. నిమిషాల వ్యవధిలోనే లోపలి భాగానికి వ్యాపించాయి. కర్టెన్లకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. లోపలంతా మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో నిద్రలో నుంచి లేచిన ప్రయాణికులు రక్షించండి.. కాపాడండి... అంటూ గట్టిగా కేకలేశారు. ప్రవేశ ద్వారం, అత్యవసర ద్వారాల తలుపులు మూసుకుపోవడంతో బయట ఉన్నవారికి వారిని ఎలా రక్షించాలో అర్థంకాక చూస్తుండిపోయారు. బద్దలు కొట్టిన కిటికీల దగ్గరకు వెళ్లేందుకు కూడా దారి కనపడకపోవడం, మరోపక్క దట్టంగా అలుముకున్న పొగ కారణంగా ప్రయాణికులు తప్పించుకునే మార్గాలన్నీ మూసుకుపోయాయి. దీంతో బస్సులోనే చిక్కుకుపోయిన 19 మంది పొగ తీవ్రతకు స్పృహ కోల్పోయి.. అక్కడే సజీవ దహనమయ్యారు.

**మంటల్లో కాలిపోయిన ప్రయాణికుల బ్యాగులు, దుస్తులు**

తలుపులు మూసుకుపోయినప్పుడు బస్సులోని ప్రయాణికులను రక్షించేందుకు డ్రైవర్లు కిటికీల అద్దాలు బద్దలుకొట్టి ఉంటే అందరూ సురక్షితంగా బయటపడేవారు. వారు అలాంటి ప్రయత్నాలేమీ చేయకుండా చోద్యం చూశారు. అద్దాలు పగలగొట్టేందుకు చిన్నపాటి సుత్తులు అందుబాటులో ఉంచి ఉంటే ప్రయాణికులే అద్దాలను బద్దలుకొట్టుకుని బయటపడి ఉండేవారు. బస్సులో అవి కూడా లేకపోవడంతో కొందరు చేతులతోనే అద్దాలను గట్టిగా బాదారు. ఈ క్రమంలో ప్రమాదం నుంచి బయటపడిన కొందరి చేతులకు గాయాలయ్యాయి.

**డ్రైవర్ వాదన మరోలా..**

ప్రమాదం జరిగిన సమయంలో బస్సును నడిపిన డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య పరారయ్యాడు. ప్రత్యామ్నాయ డ్రైవర్ శివ మాత్రం పోలీసులకు మరో వాదన వినిపించారు. 'ద్విచక్రవాహనదారుణ్ని అంతకుముందే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతని మృతదేహం రోడ్డు పక్కన పడి ఉంది. ద్విచక్రవాహనం మాత్రం రోడ్డు మధ్యలో పడిపోయింది. మా బస్సు వేగంగా వెళుతుండటంతో దగ్గరికి వచ్చేవరకు ఆ బైక్ కనిపించలేదు. ఆకస్మికంగా బ్రేక్ వేస్తే ప్రమాదం జరిగే ఆస్కారం ఉండటంతో ఆ ద్విచక్రవాహనంపై నుంచి బస్సును పోనిచ్చే ప్రయత్నం చేశాం. ద్విచక్రవాహనం బస్సు కింద ఇరుక్కుపోవడంతో ముందుకు వెళ్లలేకపోయాం. మా బస్సే ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లయితే శివశంకర్ మృతదేహం కూడా బస్సు కింద పడి నుజ్జునుజ్జయ్యేది' అని శివ చెప్పాడు. దీంతో ఘటనకు దారితీసిన పరిస్థితిపై స్పష్టత కొరవడింది. పోలీసులు కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు**

వి.కావేరి ట్రావెల్ సంస్థ బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యపై బీఎన్ఎస్ 125(ఏ), 106(1) సెక్షన్ల కింద కల్లూరు మండలం ఉలిందకొండ ఎస్సై ధనుంజయ కేసు నమోదు చేశారు. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన నెలకుర్తి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఫిర్యాదులో ఆయన తెలిపిన వివరాల మేరకు.. నెలకుర్తి రమేష్, గోళ్ల రమేష్ సమీప బంధువులు. వరుసకు అన్నదమ్ములవుతారు. హిందుస్థాన్ యూని లీవర్ లిమిటెడ్ కంపెనీలో సేల్స్ మేనేజర్లుగా పనిచేస్తున్న వీరిద్దరూ బెంగళూరులోని సుబ్బన్నపాళెంలో ఒకే అపార్ట్‌మెంట్‌లో వేర్వేరు ఫ్లాట్లలో నివసిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఇద్దరూ తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 20న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వద్ద వి.కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కారు.

నెలకుర్తి రమేష్, ఆయన భార్య శ్రీలక్ష్మి, కుమారుడు అభిరాందన్, కుమార్తె జస్మితతో కలిసి లోయర్ (ఎల్) 5, 6 సీట్లలో కూర్చున్నారు. గోళ్ల రమేష్, ఆయన భార్య అనూష, కుమార్తె మన్విత, కుమారుడు శశాంక్‌తో కలిసి అప్పర్ (యు) 5, 6 నంబరు సీట్లలో కూర్చున్నారు. వీరితో సహా 40 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో కల్లూరు మండలం చెట్లమల్లాపురం వద్ద బస్సులో పెద్ద శబ్దం రావడం.. ముందు భాగంలో మంటలు కనిపించడంతో నెలకుర్తి రమేష్ వెనుక వైపు బస్సు అద్దాన్ని పగలగొట్టి తన భార్య, ఇద్దరు పిల్లలతో బయటపడ్డారు. గొల్ల రమేష్ దంపతులు, పిల్లలు బయటకు రాలేకపోయారు.

పొగ పీల్చి అస్వస్థతకు గురైన తన భార్య, ఇద్దరు పిల్లలను నెలకుర్తి రమేష్ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి, తిరిగి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బస్సు పూర్తిగా తగలబడిపోయి 19 మంది మృతి చెందారు. ముందు వెళ్తున్న బైకును ఢీకొట్టడంతో బస్సు కింద భాగంలో బైక్ ఇరుక్కుపోయిందని.. దాదాపు 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో పెట్రోల్ లీకై అగ్గిరవ్వలు రేగి మంటలు చెలరేగడంతో బస్సు మొత్తం కాలిపోయిందని నెలకుర్తి రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బస్సు డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో కోరారు.

# అంగన్వాడీ సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం సహించం..

- మొదటి పేజి తరువాయి

రాజీ ఉండదని ఆమె స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై సీతక్క జిల్లా అధికారులతో శుక్రవారం సెక్రటేరియెట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ సెంటర్లలో విద్యుత్ కనెక్షన్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉదయం 9 గంటల్లోపు అంగన్వాడీ సెంటర్లు తప్పనిసరిగా ప్రారంభం కావాలని చెప్పారు. సెంటర్లు ఆలస్యంగా తెరుచుకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 90 శాతం లబ్ధిదారులు ఎఫ్ఆర్ఎస్ విధానంలో సరుకులు అందుకుంటుండగా, దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి పేర్కొన్నారు.

చిన్నారుల హాజరును పెంచాలి..

అక్టోబర్ నెలలో ఇప్పటి వరకు గర్భిణుల హాజరు 80 శాతం, బాలింతల హాజరు 85 శాతం ఉండటంపై మంత్రి సీతక్క సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీలో చిన్నారుల హాజరు ప్రస్తుతం 68 శాతం ఉండగా, దాన్ని 90 శాతానికి పెంచాలన్నారు. జిల్లా అధికారులు ప్రతి నెలా పురోగతి నివేదికలను సమర్పించాలన్నారు.

బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలని పిలుపునిచ్చిన సీతక్క.. ప్రతి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే, శక్తి సదనాలు, స్టే హోమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు.

# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఏఐసీసీ కార్యాలయంలో కీలక సమావేశం

- మొదటి పేజి తరువాయి

ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకానున్నారు. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపికను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు తెలంగాణకు 22 మంది పరిశీలకులను నియమించింది. ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఏఐసీసీ సీనియర్ నాయకులను ఇన్‌ఛార్జిలుగా నియమించింది. ఈ నెలాఖరు వరకు డీసీసీ అధ్యక్షులను నియమించనున్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆయా జిల్లాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి.

ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా, ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు ఢిల్లీలో ఉండనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది.

# ఏపీకి గూగుల్ రాక వెనుక 13 నెలల శ్రమ ఉంది

మొదటి పేజీ తరువాయి

ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎందుకు ఎంచుకోవాలో వివరించారు.

**పెట్టుబడులకు మూడు ప్రధాన కారణాలు**

ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. "మొదటిది, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూపంలో అనుభవజ్ఞుడైన, దార్శనిక నాయకత్వం ఉంది. భారీ ప్రాజెక్టులను ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా మెండుగా ఉంది. రెండో కారణం, మేం ఒక స్టార్టప్ స్టేట్ మాదిరిగా దృఢ సంకల్పంతో పనిచేస్తాం. ఒకసారి మాతో చేతులు కలిపితే అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్. వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం. నిర్దేశించిన సమయం కంటే ముందే పూర్తిచేయడమే మా లక్ష్యం. మూడోది, మాది జాతీయ దృక్పథం ఉన్న ప్రాంతీయ పార్టీ. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూనే, రాష్ట్రానికి మేలు చేకూర్చేలా జాతీయ విధానాలను ప్రభావితం చేస్తాం" అని వివరించారు.

**గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ ఉదాహరణలు**

గూగుల్ ప్రాజెక్టు కోసం తాము పడిన శ్రమను లోకేశ్ గుర్తుచేశారు. "గూగుల్ డేటా హబ్ వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉంది. నేను స్వయంగా వారిని ప్రాజెక్టు స్థలానికి తీసుకెళ్లాను. వారి కార్యాలయానికి వెళ్లి ఏపీని ఎందుకు ఎంచుకోవాలో వివరించాను. వారు కోరిన విధానపరమైన మార్పుల కోసం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్విని వైష్ణవ్‌లతో మాట్లాడి మార్పులు చేయించాం" అని తెలిపారు. కేవలం ఒక జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ అయిన ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టును ఏపీకి తీసుకొచ్చామని, నవంబర్‌లో దీనికి శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు.

**16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు**

గత 16 నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని లోకేశ్ స్పష్టం చేశారు. "ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే మా లక్ష్యం. ఆటోమోటివ్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ సహా 15 రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటాం" అని ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు హాజరై, రాష్ట్రంలోని అవకాశాలను పరిశీలించాలని పెట్టుబడిదారులను ఆయన ఆహ్వానించారు.

# సుంకాలపై ట్రంప్ బెదిరింపులు.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని ఆయన స్పష్టం చేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్ అనేక వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందని అన్నారు. కరోనామహమ్మారి సమయంలో ప్రపంచ దేశాల మధ్య ఏర్పడిన అంతరాయాల నేపథ్యంలో, 2021లో భారతదేశ వాణిజ్య విధానంలో మార్పు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఒంటరిగా ఉండకూడదని, ఇతర దేశాలతో విశ్వసనీయ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకుంటున్నామని తెలిపారు.

దీని ద్వారా సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్లు వంటి ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. భారత్ వాణిజ్య ఒప్పందాలకు

కట్టుబడి ఉంటుందని, కానీ ఒత్తిడితో మాత్రం చర్చలు జరపదని స్పష్టం చేశారు. ఇప్పటికే భారత్‌పై ఉన్న సుంకాలను అంగీకరిస్తున్నామని, అలాగని మరిన్ని సుంకాలు వేస్తామనే బెదిరింపు ధోరణిని అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాలు, కొత్త మార్కెట్లను అన్వేషిస్తామని వ్యాఖ్యానించారు.

## ఏపీకి తుపాను ముప్పు ..

# నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

దీని ప్రభావంతో రాబోయే అయిదు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, ఆదివారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది. సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, అనకాపల్లి, గుంటూరు తదితర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రకాశం జిల్లా పాకాలలో 152.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.

# అడవుల ఆక్రమణను ఉపేక్షించొద్దు

మొదటి పేజీ తరువాయి

సొంత ఇలాకాలో అటవీ భూములను ఆక్రమించుకున్నా అప్పటి అధికారులు ఎందుకు స్పందించలేదు? ఇలాంటి వాటికి కూటమి ప్రభుత్వంలో చోటులేదు. పార్టీలు, వ్యక్తులకు అతీతంగా కబ్జాలపై వేగంగా స్పందించాల్సిన బాధ్యత అటవీ అధికారులదే' అని అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 'విధి నిర్వహణలో ఎలాంటి భయాలకు తావు ఇవ్వొద్దు. రాష్ట్రంలో అటవీ భూమిపై సమగ్ర సర్వే చేసి ఆక్రమణలకు గురైన భూమి స్వాధీనానికి ఇతర శాఖల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయండి.

**కడలి కోతకు మడ మొక్కలతో రక్షణ**

గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రతిష్ఠాత్మంగా ప్రారంభిస్తున్నాం. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీరం వెంబడి తాటి, పాల్మిరా, పాడనస్ వంటి మొక్కలు నాటి ఆకు పచ్చ గోడ నిర్మిద్దాం. పిఠాపురం నియోజకవర్గంలో తీరం కోతను మడ అడవుల పెంపకంతో నివారించవచ్చు. శేషాచలం అడవుల్లో హెలికాప్టర్ల ద్వారా ఎర్రచందనం విత్తనాలు చల్లేలా ప్రణాళికలు చేశాం. నూతన సాంకేతికతతో ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి. రాష్ట్రం నుంచి కలపను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలి.

**పైలట్ ప్రాజెక్టుగా తెల్లపొనికి చెట్ల పెంపకం**

ఉడ్ బ్యాంక్స్ ఏర్పాటు, పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఎకో టూరిజాన్ని ప్రోత్సహిద్దాం. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ముడి కలప కొరత తీర్చేందుకు అంకుడు, తెల్ల పొనికి చెట్ల పెంపకం చేపడదాం' అని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఈ సందర్భంగా గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతికత ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (అటవీ) పి.మల్లికార్జునరావు, ఎన్ఐడీఎం దక్షిణ క్యాంపస్ జాయింట్ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్.రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ అధిపతి డా.పీవీ చలపతిరావు, అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్ డా.శాంతిప్రియ పాండే తదితరులు పాల్గొన్నారు.

# నచ్చినట్లు చేస్తామంటే కుదరదు

మొదటి పేజీ తరువాయి

గడువు పొడిగింపు జరిగినట్లయితే దుకాణాల కేటాయింపు ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఈనెల 18 వరకు స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా దుకాణాల కేటాయింపు ప్రక్రియ కొనసాగించవచ్చంది. దరఖాస్తుల గడువును 18 నుంచి 23వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన డి.వెంకటేశ్వరరావు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.తుకారాంజీ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ గడువు పొడిగింపునకు నిబంధనలు అనుమతించవని తెలిపారు. ఏపీలో కూడా ఇదే పరిస్థితి ఉంటే హైకోర్టు గడువు పొడిగింపును రద్దు చేసిందన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18న రాజకీయ బంద్‌కు పిలుపునివ్వడంతోపాటు సాంకేతిక సమస్యలు తలెత్తాయని అందువల్ల గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈనెల 18 వరకు 89,343 దరఖాస్తులు వచ్చాయని, పొడిగింపు తరువాత కేవలం 5,793 అందాయన్నారు. ఎంపిక ప్రక్రియలో మార్పులు చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉందన్నారు. ఒక్క రోజు గడువు ఇస్తే సుప్రీంకోర్టు తీర్పులతో సహా ప్రభుత్వ వివరణను ఇస్తామనడంతో న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను శనివారానికి వాయిదా వేశారు.

**దివ్యాంగులకు రిజర్వేషన్‌లపై నోటీసులు**

మద్యం దుకాణాల కేటాయింపులో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా జస్టిస్ ఎన్.తుకారాంజీ విచారణ చేపట్టారు. పిటిషన్‌పై తేలేదాకా కేటాయింపు ప్రక్రియపై స్టే ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ ఇది వాణిజ్యపరమైన అంశమని, రిజర్వేషన్‌లు కేవలం సంక్షేమ పథకాలకే వర్తిస్తాయన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి స్టేకు నిరాకరించారు. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేశారు.

## ఎంఈఓ టి.రమకి అభినందనలు తెలియజేసిన టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),అక్టోబర్ 24, శుక్రవారం టీఎస్ యుటిఎఫ్ భద్రాచలం మండల కమిటీ తరపున డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సంచాలకులు నికోలస్ మరియు సంయుక్త సంచాలకులు వెంకట నరసమ్మ చేత ఉత్తమ విద్యాధికారిగా సన్మానం ,ప్రశంసా పత్రాన్ని పొందిన భద్రాచలం మండల విద్యాధికారి తోటమల్ల రమని అభినందించారు.. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారి మరియు జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల, భద్రాచలం ప్రధానోపాధ్యాయురాలు రమ సేవలను గుర్తించిన రాష్ట్ర విద్యాశాఖ, పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు ను తీర్చిదిద్దడంలో అనేక ప్రత్యేక కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తూ, వారికి కావలసిన కనీసం మౌలిక సదుపాయాలను పట్టణ ప్రముఖుల సహాయంతో సమకూరుస్తూ పాఠశాల విద్యాభివృద్ధి కి మరియు సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తూ జిల్లాలోనే భద్రాచలం మండలాన్ని విద్యాభివృద్ధిలో ముందు ఉంచడానికి మండల విద్యాశాఖ అధికారిగా కృషిచేస్తూ మంచి పరిపాలనాదక్షురాలు గా అందరి ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్న టి రమ కృషి కి సరైన గుర్తింపు లభించిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు రాజ శ్రీనివాస్ కోశాధికారి ఎస్ ఆశాలత మండల కార్యదర్శి పి ఎస్ వి ప్రసాద్ కే సైదులు సంఘ సభ్యులు సువర్చల , మమత,ఎం.రజిని తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాలను పరిపూర్తి చేయండి.

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),అక్టోబర్ 24,డిసెంబర్ 26న జరగనున్న సిపిఐ శత వసంతాల ముగింపు వార్షికోత్సావాల సందర్బంగా ఖమ్మం నగరంలో జరిగే బహిరంగ సభకు సంబంధించి జనసమీకరణ, నిధి వసూళ్ల లక్ష్యాలను, అదేవిధంగా సభ్యత్వ నమోదు, చేర్పింపు లక్ష్యాలను పరిపూర్తి చేయడంతోపాటు రాష్ట్ర, జిల్లా స్థాయి జీప్ జాతా కార్యక్రమాలను జయప్రదం చేయాలని, ముగింపు ఉత్సావాల సందర్బంగా అన్ని మండల, గ్రామ కేంద్రాల్లో ఉత్సావాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రుగొండ, పాల్వంచ మండలాల కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొని పార్టీ శ్రేణులకు అయన దిశానిర్ధేశం చేశారు.

## మంగళ కైశిక (క్షీరాబ్ది) ద్వాదశి.. వ్రతాలు జరిపించండి...

- హిందూ ధర్మ ప్రచార పరిషత్ కో ఆర్డినేటర్,కర్నాటి రామకృష్ణా రెడ్డి.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), అక్టోబర్ 24, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నవంబర్ 2వ తారీఖున తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కో ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మంగళ కైశిక (క్షీరాబ్ది) ద్వాదశి వ్రతాలను చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలో చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామాలలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన మిత అయ్యళ్వార్ (దాసుల)పురోహి తుల ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలిపారు. ఈ వ్రతాలను షెడ్యూల్డ్ కులాలకు చెందిన మిత అయ్యళ్వార్ (దాసుల )ల సమక్షంలో చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలో మిత అయ్యళ్వార్ పురోహితులు పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, బీర రమణయ్య, సత్తీష్ చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామంలో పూదూరి గోపాలకృష్ణ, గుర్రం వెంకట దాసు, తాళ్ళూరి రాందాసుల సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ వ్రతాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీక రించాల్సిందిగా కోరుచున్నాము.

# డీజీపీని కలిసిన ఖమ్మం బీజేపీ నేతలు

- 4 అంశాలపై వినతిపత్రం సమర్పణ
- ఫిర్యాదు అంశాలను పరిశీలిస్తానని డిజిపి హామీ



సి కె న్యూస్ ప్రతినిధి:ఖమ్మం జిల్లాలో ప్రజల భద్రత, సామాజిక న్యాయం, జరుగుతున్న అక్రమాలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా నాయకత్వం రాష్ట్ర పోలీసు ప్రధానాధికారి (డీజీపీ)ని నేరుగా సంప్రదించింది. శుక్రవారం హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో-ఇన్చార్జ్ జాతీయ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు లతో కూడిన జిల్లా బృందం డీజీపీని కలిసి, నాలుగు కీలక అంశాలను స్పష్టంగా ప్రస్తావిస్తూ వినతిపత్రాన్ని సమర్పించింది.

వినతిపత్రంలో ప్రధానంగా నాలుగు అంశాలను నేతలు ప్రస్తావించారు. మొదటగా, అక్టోబర్ 18న సత్తుపల్లిలో జరిగిన బీసీ బంద్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కమల్ పాషా తదితరులు బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షులు బానోతు విజయ్ లతోపాటు కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని నేతలు ఫిర్యాదు చేశారు. శాంతియుతంగా సాగుతున్న బంద్ కార్యక్రమానికి భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాక, కమల్ పాషా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నాడని, ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాడని వారు ఆరోపించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రెండవ అంశంగా, పెనుబల్లి మండలం ఎరుగట్ల గ్రామంలో ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో జరిగిన భారీ అవకతవకలపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు, బోర్లు ఉన్నవారికి ఇళ్లు కేటాయించడం, గుడిసెల్లో ఉన్న పేదలను నిర్లక్ష్యం చేయడం సామాజిక అన్యాయమని వారు డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. మూడవదిగా, ఖమ్మం-ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో గోవుల అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతోందని, దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న గోరక్షకులు బెదిరింపులకు గురవుతున్నారని నేతలు తెలిపారు. గోవుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే గోరక్షకులకు పోలీసు రక్షణ కల్పించాలని వారు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

చివరి అంశంగా, ఖమ్మం జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కొనసాగుతుందని, ఈ విషయంపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమ రవాణా అలాగే సాగుతుందని నేతలు వివరించారు. ప్రధానంగా ఖమ్మం పట్టణంలో కళాశాలలు, పాఠశాలలను అడ్డాగా చేసుకుని గంజాయి వ్యాపారం గుట్టు చప్పుడు కాకుండా తిరుగుతుందని బీజేపీ తరపున ఫిర్యాదు చేశారు. డీజీపీ వినతిపత్రాన్ని స్వీకరించి, ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినారు. జిల్లాలో చట్టవ్యవస్థను కాపాడి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. డీజీపీని కలిసిన వారిలో నాయకులు దేవకి వాసుదేవరావు, ఈ వి రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, నాయుడు రాఘవరావు లు కూడా ఉన్నారు.

## ప్రజలకు సకాలంలో, సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలి.



జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),అక్టోబర్ 24, ప్రజలకు సకాలంలో, సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలన్నారు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్. జిల్లా వ్యాప్తంగా నవంబర్ 1 నుండి 7 వరకు జరగనున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం ) కార్యక్రమానికి సంబంధించి, కేంద్ర జాతీయ ఆరోగ్య మిషన్ బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ముందస్తు ఏర్పాట్లను మరియు ఆరోగ్య కేంద్రాల స్థితిగతులను స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం పలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చాతకొండ పల్లె దవాఖాన మరియు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాలలో వైద్య సిబ్బంది హాజరు, ఔషధ నిల్వలు, శుభ్రత, శానిటేషన్, టీకా కార్యక్రమాల పురోగతి, గర్భిణీ స్త్రీలు మరియు శిశువులకు అందిస్తున్న సేవలను సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసూతి గది, ఔషధ నిల్వ గది, ఔషధ నిల్వల పట్టిక, ల్యాబ్, అవుట్‌పేషెంట్ విభాగం, శానిటేషన్ విభాగం, పేషెంట్ వేటింగ్ హాల్స్ సవివరంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచి, రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రులు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఆయుష్మాన్ కేంద్రాలలో అవసరమైన సదుపాయాలు పూర్తిగా సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కేంద్ర జాతీయ ఆరోగ్య మిషన్ బృందం పర్యటనకు ముందు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి, అని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఆరోగ్య కేంద్రం సమర్థవంతంగా పనిచేయాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందేలా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆసుపత్రి ప్రాంగణాల్లో శుభ్రత, పచ్చదనం మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బయో వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం జరగకూడదని కలెక్టర్ హెచ్చరించారు.

జిల్లాలో ఆరోగ్య సేవల నాణ్యతను పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, రోగులకు అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు కొనసాగించాలన్నారు.

కేంద్ర జాతీయ ఆరోగ్య మిషన్ బృందం పర్యటన విజయవంతం కావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు మరియు వైద్య సిబ్బంది ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు.

ఈ పర్యటనలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశాడు- మేం వ్యవస్థను నిర్మిస్తున్నాం:బి పి నాయక్




తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో 3,456 మంది కొత్త లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్లు (డిప్యూటీ సర్వేయర్లు)కు నియామక పత్రాలు (లైసెన్సులు) పంపిణీ చేశారు.

30 రోజుల ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత ఈ లైసెన్సులు ఇచ్చారు. ఇది 'భూభారతి' చట్టం కింద భాగం - ల్యాండ్ రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి అయినందున, ప్రతి మండలానికి 3-4 సర్వేయర్లు లను నియమించారు.

సీఎం సర్వేయర్లకు పత్రాలు పంచేస్తూ,కర్షకుల హక్కులు రక్షించండి, భూమి సర్వేలో తప్పులు చేయకండి అని సూచించారు.

సీ కే న్యూస్ మునుపటి బీ ఆర్ యస్ ప్రభుత్వం ధరణి చట్టం వల్ల రెవెన్యూ సిస్టమ్‌ను "ధ్వంసం చేసింది" అని బీపీ నాయక్ విమర్శిస్తూ, ఇప్పుడు దాన్ని బలోపేతం చేస్తున్నాము అని అన్నారు. కొందరు ముఖ్యమంత్రి ఏ స్థాయి లో పని చేయాలో ఉచిత సలహాలు ఇస్తున్నారు. ముందు ఈ అవసరం ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందని, గత ప్రభుత్వంలో వ్యవస్థను కెసిఆర్ ఎట్లా నాశనం చేశారో తెలుసుకోవాలని హితవు పలికారు.

డిప్యూటీ సర్వేయర్ పాత్ర కీలకంమని, గత ప్రభుత్వంలో మాదిరి తప్పులు జరగకుండా ఎంతో బాధ్యతతో పని చేసి రైతులకు మేలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపిచ్చారు అని అన్నారు.

తెలంగాణను 2047కల్లా 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయాలంటూ పిలుపునిచ్చారు. ఇది సాధారణ పంపిణీ కాకుండా, విజన్ మరియు రెస్పాన్సిబిలిటీని హైలైట్ చేసే ఈవెంట్ ఇది స్టేట్-లెవల్ ఇంపాక్ట్‌తో కనెక్ట్ అవుతుంది అని బీపీ నాయక్ అభిప్రాయపడ్డారు.

ఇది తెలంగాణలో రెవెన్యూ సిస్టమ్‌ను బలపరచడానికి మంచి స్టెప్ - మునుపటి గవర్నమెంట్ సర్వేయర్ల సంఖ్య తగ్గించినందున, ఇప్పుడు 350 నుంచి వేలాది మందికి పెంచామని ఫార్మర్స్ ల్యాండ్ డిస్ప్యూట్లు తగ్గుతాయి, రిజిస్ట్రేషన్ సులభమవుతుంది అని, రైతుల కోసం ఏ స్థాయి లో దిగి పనిచేయడానికి సిద్దం అని బీపీ నాయక్ అన్నారు

## కె హెచ్ ఆర్ ఫౌండేషన్ తరపున మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం (యం) రహీంఖాన్ పేట గ్రామంలో 24-10-2025 రోజున ముత్యాల బాల నర్సయ్య గౌడ్ అనారోగ్యంతో చనిపోవడం జరిగింది వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ %దీ=ా% పార్టీ రాష్ట్ర నాయకులు %ఖఎ=% ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి గారి సహకారంతో గ్రామ శాఖ ఆధ్వర్యంలో 5,000 రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో %దీ=ా% పార్టీ నాయకులు గ్రామశాఖ అధ్యక్షులు సుధగాని. లింగయ్యగౌడ్ గారు,మాజీ సర్పంచ్ పర్వతాలు , ఉపాధ్యక్షులు ఆవుల.మల్లయ్య మాజీ అధ్యక్షులు మేరుగు.అంజయ్యగౌడ్ ,ఆలేరు నియోజకవర్గ కార్యదర్శి బండి.నరేష్ ,ఆత్మకూరు(యం)మండల యూత్ ప్రధాన కార్యదర్శి దుంప.పరశురాములు పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల.సత్తయ్యగౌడ్ ,కమ్మంపాటి.అంజయ్యగౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ద

## ఆత్మకూర్ (ఎం) మండలం ఆత్మకూర్ (ఎం) ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని గౌరవ ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య గారు ప్రారంభించడంజరిగింది.



సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్

ఈ కార్యక్రమం లో స్థానిక మండల %వీ=ా% గారు,ఎంపీడీఓ గారు, %ణ=ణూ% నుండి డీపీఎం బాలరాజు గారు,

జిల్లా సమాఖ్య కార్యదర్శి రచ్చ పల్లవి,ఏపీఎం జీ నర్సింహ్మా, సీసీ లు హరిబాబు,కొమురయ్య,%ూాజూ% చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ పాశం వినోద, మండల నుండి కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం, మాజీ సర్పంచ్ జెన్నాయికోడే నగేష్,ఉపసర్పంచ్ దొంతరబోయిన,నవ్య పోతగాని మల్లేశం మార్కెటింగ్ సభ్యులు కే శిరీష,ఏ లక్ష్మీ,పాశం శ్యామల, తవిటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బయో వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలి.



● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),అక్టోబర్ 24,**జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో బయో వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రుల్లో బయో వ్యర్థాల మేనేజ్‌మెంట్‌పై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోగుల ఆరోగ్య భద్రత మరియు పర్యావరణ పరిరక్షణ కోసం ఆసుపత్రుల్లో బయో వ్యర్థాల సక్రమ నిర్వహణ అత్యంత కీలకమని అన్నారు.

ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను వర్గీకరించి, ప్రత్యేక కంటైనర్లలో నిల్వ చేయడం, వాటిని గుర్తించిన సర్టిఫైడ్ ఏజెన్సీల ద్వారా సమయానికి సేకరించి శాస్త్రీయంగా పారవేయడం అనివార్యమని కలెక్టర్ సూచించారు. ప్రతి ఆసుపత్రిలో బయో వ్యర్థాల నిర్వహణ బాధ్యత వహించే నోడల్ అధికారులు ఉండాలని, వారు ప్రతిరోజు రికార్డులను సక్రమంగా నమోదు చేసి, నియమిత సర్టిఫైడ్ ఏజెన్సీకి అందచేయాలని ఆదేశించారు.

అసుపత్రుల పరిశుభ్రత, వ్యర్థాల నిల్వ ప్రదేశాలు, సేకరణ విధానం, రవాణా వాహనాల శానిటేషన్ వంటి అంశాలపై పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని అన్నారు. పర్యావరణ కాలుష్యం నియంత్రణ మండలి ( పి సి బి ) అధికారులు ఆసుపత్రులను తరచూ పరిశీలించి, బయో వ్యర్థాల నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కూడా ప్రభుత్వ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం బయో వ్యర్థాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి. సిబ్బందికి శిక్షణలు ఇవ్వడం, రక్షణ పరికరాలను ఉపయోగించడం, వ్యర్థాలను క్రమపద్ధతిలో నిర్వహించడం తప్పనిసరి అని కలెక్టర్ ఆదేశించారు.


ఆర్ఎంపీలు లేదా ఇతర వ్యక్తులు బయో వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో లేదా మున్సిపాలిటీ వ్యర్థాలతో కలిపినట్లయితే, కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై పెనాల్టీ విధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు ద్వారా పర్యవేక్షణను ప్రయోగాత్మకంగా జిల్లా లో ఒక ప్రాంతంలో అమలు చేయాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్లు ఆసుపత్రులు, ఆర్ఎంపీల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి, బయో వ్యర్థాల సురక్షిత నిర్వహణ, నియమావళి భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, జిల్లావ్యాప్తంగా ఆసుపత్రులలో అవగాహన కల్పించేందుకు గోడపత్రికలను రూపొందించమని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన భద్రతా అధికారులకు ఆదేశించారు.

సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి విజయలక్ష్మి, డిసిహెచ్ ఓ రవిబాబు, పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ డీ.ఈ. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సుజాత, మణుగూరు మున్సిపల్ కమిషనర్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలకు దరఖాస్తులు చేసుకోండి..

హిందూ ధర్మ ప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి..




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), అక్టోబర్ 24,** తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఖమ్మం జిల్లాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహించే భగవద్గీత కంఠస్థ పోటీలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కో- ఆర్డినేటర్ హిందూ ధర్మ ప్రచార పరిషత్ రామకృష్ణారెడ్డి పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ భగవద్గీత కంఠస్థ పోటీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇందు స్వర్ణ భారతి హై స్కూల్ సుభాష్ చంద్రబోస్ నగర్ లో ది. 22-11-2025 నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలోహిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యా లయం ఖమ్మం నందు 26-11-2025 బుధవారం ఉదయం 10 గంటలకు రెండు జిల్లాల యందు భగవద్గీత కంఠస్థ పోటీలు 6,7, 8, 9 తరగతుల విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగము 16 వ అధ్యాయము దైవాసుర సంపత్ విభాగయోగము పదవ తరగతి,ఇంటర్ విద్యార్థులకు 18 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలలోపు వారికి మూడు విభాగాలలో పోటీలు కలవు కావున విద్యార్థిని విద్యార్థులతో పాటు పెద్దవా ళ్ళుకు కూడా తెలియ పరుస్తున్నాము.

ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు మూడు విభాగాలలో బహుమతులు ప్రత్యే కంగా కలవు 01- 12-2025 సోమవారం గీతా జయంతిని పురస్కరించుకొని భగవ ద్గీత కంఠస్థ పోటీలను రెండు జిల్లాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తిరుమల తిరుపతి కార్యనిర్వాహణా ధికారి అనిల్ కుమార్ సింగల్, ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి రఘునాథ్ తెలంగాణ ప్రాంత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చతుర్వేదల సత్య నారాయణ వీరి సంకల్పంతో మన హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాల యంలో నిర్వహించబడే పోటీలకు విద్యా ర్థులను సిద్ధం చేయగలరని కోరుతున్నాం. పూర్తి వివరాలకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వాహకులు కర్నాటి రామకృష్ణారెడ్డి 6300538706 ను సంప్రదించగలరు అని తెలిపారు.

# కార్మికుల బదిలీలు ఆపాలంటూ, మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో సమ్మె



**అక్టోబర్ 24 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం వడియారం గ్రామ శివారులో ఉన్న అపోలో ట్యూబ్స్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికులు అక్రమ బదిలీలు ఆపాలంటూ18 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పరిశ్రమ మజ్దూర్ సంఘం జనరల్ సెక్రెటరీ కుల్ల నర్సింలు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పరిశ్రమలో స్థానికంగా ఉన్న 69 మంది శాశ్వత కార్మికులను,ఢిల్లీ, చత్తీస్గడ్, లాంటి రాష్ట్రాలకు అకారణంగా ముగ్గురు కార్మికులను అక్రమంగా బదిలీ చేశారని, ఈబదిలీలను వెంటనే రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యం తమ అభ్యర్థనను ఇప్పటివరకు పట్టించుకోకపోవడంతో, జిల్లా కలెక్టర్, ఎంపీ, కార్మిక శాఖ మంత్రివర్యులకు, తమ సమస్యలను వివరించిన, స్థానికులంగా స్పందించిన, అధికారులు మంత్రివర్యులు, కానీ కంపెనీ యజమాన్యం, స్పందించడం లేదని, మాకు ఢిల్లీ హెడ్ ఆఫీస్ నుంచి పర్మిషన్ రావాలని మొండి వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు, ప్రతి సంవత్సరం దసరా దీపావళికి ఇచ్చే బోనస్ కూడా యజమాన్యం ఇవ్వడంలేదని, మా పొట్ట కొట్టిందని వాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమం లో కోశాధికారి కుంట రాజ్ కుమార్, మిరుదొడ్డి కుమార్, చవాన్ సురేష్, నవీన్ యాదవ్, నంద్యాల శ్రీనివాస్, పెద్ద కృష్ణ, సునీల్ పాస్వాన్, నరేందర్, యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం చేయి కలపండి: ఈ బయ్యారం సీఐ.

పినపాక జూనియర్ కళాశాలలో చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం అవగాహన కార్యక్రమం.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పినపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 24,**డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే మన అందరి ప్రధాన లక్ష్యమని ఈ.బయ్యారం సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం పినపాక మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులతో ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాలతో గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని సీఐ తెలిపారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందు కు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి యువత భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు, యువత తమ పరిసరాలలో, ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, తరలించినా సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌రహిత సమాజంతో మన జిల్లా మొదటి స్థానంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ , ఎస్సై సురేష్, పోలీస్ సిబ్బంది, కాలేజీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# చాతకొండ అంగన్‌వాడీ కేంద్రం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 24,** లక్ష్మీదేవి పల్లి మండలం చాతకొండలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను జాగ్రత్తగా పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, పాలు, గుడ్లు అందజేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించారు. అదేవిధంగా, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అందించే పోషకాహార పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే అంశంపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ భవనం పరిశుభ్రత, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, నేర్చుకునే సామగ్రి వాడకం వంటి అంశాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు పనితీరు ఆదర్శవంతగా ఉన్నాయి అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా చూడాలని అన్నారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రానికి ప్రహరి గోడ ఏర్పాటు చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరగా, ఆయన వెంటనే హామీ ఇచ్చి త్వరలోనే గోడ నిర్మాణం చెప్పడతాము తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అంగన్వాడి సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో పత్తి కొనుగోలు సీసీ కేంద్రం ప్రారంభం.

ప్రారంభకులు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 24.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని నాగారం గ్రామంలో రైతులు పండించిన పత్తి కొనుగోలు కేంద్రం సిసి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం చేసినారు.

ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని అకాల వర్షం వలన ప్రతి పండించే రైతులు నష్టపోయినారని పత్తిని ఏ గ్రేడ్ ధరకు అమ్ముకునే విధంగా రైతు ప్రయత్నం చేయాలని. ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ తోటి మాట్లాడవచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వంఅని రైతు గమనించాలని రైతుకు సపోర్ట్ గా మేము ఉంటామని మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో సిసి కేంద్రం సిబ్బంది మరియు మండల నాయకులు రైతులు మార్కెట్ డైరెక్టర్లు మార్కెట్ సిబ్బందిఅధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 59 చెక్కులు లబ్ధిదారులకు అందజేత.

ముఖ్య అతిథులు స్థానిక ఎమ్మెల్యే కుంభం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబరు 24.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో మండల పరిధిలోని లబ్ధిదారులకు రైతు వేదికలో 59కల్యాణలక్ష్మి /షాధీముభారక్ చెక్కులు పంపిణీ చేసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేసినారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మండల నాయకులు మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి పట్టణ అధ్యక్షులు కనకల కిష్టయ్య మండల నాయకులు బత్తిని సహదేవు బద్దం సంజీవరెడ్డి తుమ్మల శ్రీనివాసు ఈన్నయ్య చెరుకు శివయ్య రేకల ప్రభాకర్ ఇన్సెంటివ్ చిట్టేడి జనార్ధన్ రెడ్డి ఆవుల స్వామి ఉక్కుర్తి స్వామి గుండు దానయ్య మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ జిల్లా అధికారులు ఆర్డిఓ తహసిల్దారి అధికారులు సిబ్బంది ఎమ్మార్వో ఎండిఓ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తలకు ఫీల్డ్ లెవల్ కార్యక్రమాలపై అవగాహన ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ జయలక్ష్మి డి ఎం అండ్ హెచ్ ఓ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 24,**జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెంలో ఉన్న ఐదు ప్రాథమిక కేంద్రాల్లో ఉన్న ఆశా కార్యకర్తలకు ఫీల్డ్ లెవల్లో వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం అయినది దీనిలో భాగంగా డాక్టర్ జయలక్ష్మి డి ఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూ ఎం సి హెచ్ మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా మూడు నెలల లోపు గర్భిణీ స్త్రీల నమోదు తద్వారా హైరిస్క్ గర్భవతులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్ పోయేలా చూడాలని తెలిపారు కొత్త దంపతులకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించేలా ప్రోత్సహించాలన్నారు బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు తాగించడం ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే ఇచ్చేలా చూడాలని సకాలంలో శిశు వులకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించేలా చూడాలని పేర్కొన్నారు ఆశా కార్యకర్తలు ఫీల్డ్ లెవెల్ లో 12 రకాల హెల్త్ సర్వీసులను అందించేలా చూడాలని తెలిపారు సకాలంలో గ్రామస్థాయిలో విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు అలాగే ఎన్సిడి టీవీ ఎన్విపిడిసిపి కార్యక్రమాలపై కూడా వివిధ రకాల అంశాలపై చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ మధు వరుణ్ డాక్టర్ పుల్లారెడ్డి డాక్టర్స్ స్పందన సోమల సి హెచ్ ఓ డెమో సెక్షన్ స్టాఫ్ శ్రీనివాసరావు ఈ రమాదేవి డిపరంగిని పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ నుంచి కర్ణాటక లోని చేసిండు గణగాపూర్ కు జరిగే పాదయాత్ర



**అక్టోబర్ 24 (సి కే న్యూస్) అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**
నిర్వహిస్తున్నట్లు కరణ్ గజేంద్ర మహారాజ్,వెంకట్రామిరెడ్డి,తెలిపారు. శుక్రవారం సత్యనారాయణ స్వామి దేవాలయం నుంచి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. గత 8 ఏళ్ల నుండి మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పాదయాత్ర బృందం తెలిపారు. ప్రత్యేక పాదయాత్రగా వెళ్లడం ఆనందంగా ఉందని అన్నారు. ఈసారి కూడా రెండు బృందాలు బయలుదేరుతున్నారని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పాదయాత్రకు బయలుదేరారు,రవీందర్ నాయక్,అమృత్,అశోక్ రెడ్డి, అరుణ్,రమేష్ రెడ్డి తదితరులు పాదయాత్ర లో పాల్గొన్నారు

06 CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక
శనివారం | తెలంగాణ
25 అక్టోబర్ 2025
cknews@gmail.com
GENERAL NEWS
Follow: @cknews

# పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి.

**భద్రాచలం శాసనసభ్యులు డా.తెల్లం వెంకటరావు.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 24,**ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించిన డా.తెల్లం వెంకటరావు, ర్యాలీ లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థినిలు మరియు రోటరీ క్లబ్ సభ్యుల ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలనీ, ప్రపంచ రోటరీ సంస్థ ప్రపంచంలో పోలియోని నిర్మూలించడానికి ఎంతో కృషి చేస్తుందనీ, ప్రపంచం మొత్తానికి పోలియో వ్యాక్సిన్ ప్రపంచ రోటరీ సంస్థ సరఫరా చేస్తుందనీ, ప్రభుత్వాలు రోటరీ వంటి స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్తూ ప్రభుత్వ వైద్య ఉద్యోగులు ప్రతి ఇంటిలో సంవత్సరానికి రెండుసార్లు పోలియో చుక్కల మందులు వేసి భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా చేశారని, భవిష్యత్తులో పోలియో రాకుండా నివారించేందుకు ఈ అవగాహన ర్యాలీలను దేశవ్యాప్తంగా రోటరీ సంస్థ నిర్వహిస్తుందని కాబట్టి భద్రాచలంలో కూడా పోలియో చుక్కలు ప్రతి ఒక్కరికి అదే విధంగా చూడాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని, ప్రచారం చేయాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలపై ఉందని డా.తెల్లం వెంకటరావు ఉద్ఘాటించారు

ర్యాలీలో పాల్గొన్న సమూహాన్ని ఉద్దేశించి ప్రస్తుత భద్రాచలం రివర్ సైడ్ రోటరీ క్లబ్ అధ్యక్షులు మరియు రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ, పోలియో చుక్కలు వేయించడంపై ప్రజల్లో అవగాహన తేవాల్సిన బాధ్యత ముఖ్యంగా యువతకు ఉందని, భవిష్యత్తులో ఒక్క పోలియో కేసు కూడా రాకుండా నివారించాలని, తద్వారా పోలియోని ఈ ప్రపంచం నుండి నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థుల సమూహాన్ని ఉద్దేశించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే జాన్ మిల్టన్ ప్రసంగిస్తూ, సేవా కార్యక్రమాల్లో తామెప్పుడూ ముందుంటామని తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విద్యార్థులు చాలా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారని భవిష్యత్తులో రోటరీతో కలిసి సమాజ సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటామని పేర్కొన్నారు.

సుమారు 500 మంది పాల్గొన్న ఈ అవగాహన ర్యాలీ నందు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ బాబు రోటరీ క్లబ్ ఉపాధ్యక్షులు ధనకొండ రాఘవయ్య, గంజి సంపత్, కళాశాల ప్రణాళిక మరియు అభివృద్ధి కమిటీ సభ్యులు కొడాలి శ్రీనివాసు బుడగం శ్రీనివాసరావు తుమ్మలపల్లి ధనేశ్వరరావు, ప్రముఖ క్రీడాకారుడు దాట్ల శ్రీనివాసరాజు లతోపాటు ఎన్ఎస్ఎస్, పిఓ డాక్టర్ ఎం .కిరణ్ కుమార్, అకాడమిక్ కోర్డినేటర్ హిమజ, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఏ. శ్రీను, అధ్యాపకులు డాక్టర్.నాగసమీరా, డాక్టర్ వి .రాఘసుమ రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ క్లబ్ సభ్యులు అనేకమంది స్వచ్ఛంద సంస్థల నాయకులు సంఘ సేవకులు పాల్గొన్నారు

## మొక్కజొన్న పంటను మద్దతు ధరకు విక్రయించాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న కొనుగోలుకు జిల్లాలో 5 కేంద్రాలు ఏర్పాటులి



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :**2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న పంటకు ప్రభుత్వం ప్రతి క్వింటాల్ కు 2 వేల 400 రూపాయలు కనీస మద్దతు ధరను ప్రకటించిందని, మద్దతు ధరకు పంట కొనుగోలుకు పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో 1705 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 5456 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాతో, రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు జిల్లా వ్యాప్తంగా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా, రైతులు తమ పంటను తడి శాతం 14 శాతం లోపు ఉండేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

మధిర, ఎర్రుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లలో, ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ళ మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, సింగరేణి మండలం మాదారంలో కారేపల్లి సహకార సొసైటీ లో, ముదిగొండలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రైతులందరూ తేమ శాతం 14 శాతం లోపు ఉన్న పంటలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్ దంపతులు..



**తల్లాడ అక్టోబర్ 24 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**

తల్లాడ మండలంలోని నరసింహారావుపేట గ్రామానికి చెందిన సుంకర వెంకటేశ్వర్లు, లలిత దంపతుల కుమార్తె లక్ష్మి శ్రావణి వివాహం శుక్రవారం ఖమ్మంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి సత్యవతి దంపతులు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకూబ్ పాషా, పడాల లక్ష్మ ణ్, సూదా నరసింహారావు, గోపిశెట్టి వరప్రసాద్, తదితరులు ఉన్నారు .

## ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ...

**ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ శ్రీనివాస్**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**

యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్ల కొరకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం వారిచే అక్టోబర్ 27న (సోమవారం) ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు "నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని ఖమ్మం స్టేషన్ రోడ్ లోని ఆక్స్ ఫోర్డ్ స్కూల్ నందు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ వై.డి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించబడతాయని అన్నారు. ఉద్యోగుల కోసం ఆన్లైన్ సేవలపై అవగాహన కల్పించడం, కొత్తగా కవరైన సంస్థల యజమానులకు పరిచయం,ఆన్ లైన్ సేవల వివరాలు, పెన్షనర్ లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం, ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజనపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ శ్రీనివాస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి
- రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధిపై అవగాహన కల్పించాలి
- మున్నేరు కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, భూ నిర్వాసితులకు కేటాయించే వెంచర్ అభివృద్ధి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :**ఖమ్మం మున్నేరు నదిపై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని, రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పని జరగాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, ఏజెన్సీ అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు చేయాలని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే 125 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు 100 మీటర్ల ప్రధాన రహదారి, 40 మీటర్ల చొప్పున అంతర్గత రహదారి, నగరంకు సులభతరం చేసే విధంగా అదనంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రత్యేకంగా కల్పించే వసతులతో ఒక ప్రత్యేక వెంచర్ తో భూమి విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు, కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు.

ఖమ్మం నగరంలో మున్నేరుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నిర్ణీత గడుపు లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ ఎస్ఇ యాకుబ్, ఇఇ పవార్, ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ చెత్త లారీలను బాలాజీ నగర్ ప్రధాన రహదారి గుండా తీసుకువెళ్లొద్దు

- జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ ఆధ్వర్యంలో ధర్నా
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు




**సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్:**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ ప్రధాన రహదారి గుండా డంపింగ్ యార్డ్ చెత్త లారీలు రాకుండా, పోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ గారికి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ స్పందిస్తూ ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (శానిటేషన్ %డ% ట్రాన్స్పోర్ట్) సి.ఎన్. రఘు ప్రసాద్ గారికి సూచన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర బీజేవైఎం నాయకులు సంతోష్ గుప్తా, జిల్లా బిజెపి కార్యదర్శి కుర్ర పుణ్యరాజు, రాష్ట్ర అధికారి ప్రతినిధి బిజెపి ఓబీసీ మార్చ్ అధ్యక్షులు రంగుల శంకర్ జవహర్ నగర్ పశ్చిమ శాఖ అధ్యక్షులు కలికోట కమలాకర్, జఎంసీ బీజేవైఎం రామ్ నాయక్, ప్రధాన కార్యదర్శి వేపుల సన్నీ, ఎస్ టి మోర్చా అధ్యక్షులు రాజు నాయక్ పాల్గొన్నారు.

## క్రిష్ణాపురంలో అయ్యప్ప స్వాముల మహా పడిపూజకు కాంగ్రెస్ నేత నారపోగు వెంకట్ 50వేల రూపాయల విరాళం..

**వెంకట్ కు కృతజ్ఞతలు తెలిపిన అయ్యప్ప భక్త బృందం..**



**తల్లాడ అక్టోబర్ 24 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** స్వగ్రామానికి సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ నేత, సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తల్లాడ మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులకు ఆయన తనవంతుగా 50వేల రూపాయలను శుక్రవారం నిర్వాహకులకు విరాళంగా అందించారు. ఈనెల 25వ తేదీన గ్రామంలోని హరిహరసుత అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములకు 50 వేల నగదును అందించి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. గతంలో కూడా ఇంత పెద్ద నగదును అయ్యప్ప స్వాములకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. తాను ఎక్కడ ఉండా గ్రామాభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. నగదును అందించిన వెంకట్ కు అయ్యప్ప స్వామి భక్త బృందం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ విలా సాగరం అభిరామ్, స్వాములు విలాసాగరం వెంకట్రావు, విలా సాగరం శ్రీను పాల్గొన్నారు.

# బాబు పీక్స్ అయితే జగన్ వీక్ నా ?

మాజీ సీఎం వైఎస్ జగన్ ఏపీ సీఎం చంద్రబాబు విషయంలో తాజాగా కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుని విమర్శించే క్రమంలో ఆయన మంచి టైమింగ్ రైమింగ్ తో కొత్త పదాలనే వాడారు. ఎపుడూ ఒకే తరహా విమర్శలు చేస్తే జనాలకు ఎక్కవు. అందునా సోషల్ మీడియా యుగం కాబట్టి వారు చాలా అడ్వాన్స్ గా ఉంటారు. అందుకే రాజకీయ పార్టీలు ఏవైనా అప్టూ డేట్ కావాల్సిందే. ఇక జగన్ విషయం తీసుకుంటే ఆయన చేసే విమర్శలలో ఎక్కువగా రొటీన్ డైలాగ్స్ ఉంటాయి. కానీ ఈసారి జగన్ ప్రెస్ మీట్ సుదీర్ఘంగా సాగినా చాలా విషయాలు టచ్ చేస్తూ వీలైనంత కొత్తదనం నింపే ప్రయత్నం అయితే చేశారు అనుకోవాలి.

**క్రెడిట్ చోరీ అంటూ :**

చంద్రబాబు పెర్ఫార్మెన్స్ లో వీక్ అని క్రెడిట్ చోరీలో మాత్రం పీక్స్ అని జగన్ కామెంట్స్ చేశారు. బాబు సొంతంగా ఏ డెవలప్మెంట్ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ తీసుకోవాడానికి లేనేలేదని ఆయన మాట్లాడారు. హైటెక్ సిటీ మాజీ సీఎం నేదురుమల్లిది అయితె విశాఖలోని డేటా సెంటర్ వైసీపీ ఆలోచన అని తాము వేసిన విత్తనం అని చెప్పుకున్నారు. అలాగే హైదరాబాద్ లో ఐటీ డెవలప్మెంట్ లో చంద్రబాబు పాత్ర అయితే పెద్దగా లేనే లేదని ఆయన చెప్పుకొచ్చారు.

**ఉత్తరాంధ్ర కోసం :**

తాము 2020 నుంచి 2023 దాకా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో ఎంతో కృషి చేశామని జగన్ చెప్పారు. అదానీతో ఒప్పందం చేసుకున్నామని అలాగే సీ నుంచి వివిధ దేశాలకు వెళ్ళే సబ్సీ కేబుల్స్ ని సింగపూర్ తో ఒప్పందం చేసుకునే ప్రతిపాదనలు చేశామని అన్నారు. 2023 మేలో తాను స్వయంగా డేటా సెంటర్ ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశాను అని జగన్ చెప్పారు. అంతే కాకుండా భోగాపురం ఎయిర్ పోర్టు భూవివాదాలు తీర్చి తాము 2023లో శంకుస్థాపన చేశామని అది తమ ఘనత అన్నారు. శ్రీకాకుళంలోని మూలపేటలో పోర్టు నిర్మాణం ఘనత తమదని అన్నారు. మొత్తంగా చెప్పాలీ అంటే ఉత్తరాంధ్ర అభివృద్ధిని తాము ఎంతో కృషి చేసి బాటలు వేశామని జగన్ చెప్పారు.

**జగన్ వీక్ అయ్యారా :**

సరే ఇవన్నీ చేశామని వైసీపీ అధినేత హోదాలో జగన్ ఓటమి చెందిన పదహారు నెలల తరువాత చెబుతున్నారు, మరీ ముఖ్యంగా చూస్తే విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిన తరువాత మాదే క్రెడిట్ అని చెబుతున్నారు. అదానీ డేటా సెంటర్ అన్నది వైసీపీ హయాంలో ముందుకు వచ్చింది అన్నది వాస్తవం. అయితే అది ఆచరణలో అడుగులు పెద్దగా వేయలేదు, అయినా సరే మేము డేటా సెంటర్ ని తీసుకుని రాబోతున్నామని వైసీపీ చెప్పుకోవలసింది కదా అని అంటున్నారు. అంతే కాదు కూటమి ప్రభుత్వం డేటా సెంటర్ వస్తోంది అన్నప్పుడు అయినా మాదే ఆ ఆలోచన అని కూడా ఎందుకు చెప్పుకోలేకపోయింది అని అంటున్నారు.

**చేతులు కాలాక ఆకులు :**

ఎయిర్ పోర్టు విషయంలో వైసీపీ తీసుకున్న చొరవను ఎన్నికల వేళ కానీ ఆ ముందూ తరువాత కానీ ఎందుకు చెప్పలేకపోయారు అన్నది కూడా ప్రశ్నగానే ఉంది. ఏది ఏమైనా వైసీపీ ఎంతసేపూ నగదు బదిలీ పథకం పేరు చెప్పుకుంది. జగన్ కూడా తాను ఇన్ని వందల సార్లు బటన్ నొక్కాను ఓటు వేయండి అని ఎన్నికలలో ప్రచారం చేశారు కానీ ఫలనా ప్రాంతానికి తాము ఫలానాది చేశామని లేక చేయాలని అనుకున్నామని ఎక్కడా చెప్పలేదని గుర్తు చేస్తున్నారు. టీడీపీ పబ్లిసిటీ విషయంలో పీక్స్ అని చెబుతున్న వైసీపీ అదే సమయంలో తాను వెరీ పూర్ బాగా వీక్ అని కూడా చెప్పుకోవాలని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీ కూడా ఇటీవల కాలంలో శ్రీకాకుళం ఉద్దానం ఆసుపత్రి గురించి చెబుతోంది. తాము కట్టిన మెడికల్ కాలేజీల గురించి చెబుతోంది. అయితే ఏమి చేసినా ఎంత చెప్పినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందమని అంటున్నారు. పైగా టీడీపీ తాము చేసింది చేయబోయేది అన్నీ ప్రజలకు చెప్పుకోవడంలో తప్పు లేదని అంటున్నారు. ఇదే న్యూ ట్రెండ్ పాలిటిక్స్ అని అంటున్నారు.

# ఎముకలు బలంగా ఉండాలంటే.. వీటిని తీసుకోవాలి!



వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకలు సహజంగా బలహీనపడుతుంటాయి. దీంతో ఫ్రాక్చర్లు, ఆస్టియో పోరోసిస్, ఇతర సమస్యల బారిన పడే రిస్క్ పెరుగుతుంది. కానీ, వయసు పెరుగుతున్నా, వృద్ధాప్యంలోకి అడుగు పెట్టినా ఎముకలు దృఢంగా ఉండాలంటే అందుకు కొన్ని చర్యలు తీసుకోవాలి.

**క్యాల్షియం**

ఎముకలకు తగినంత క్యాల్షియం అందేలా చూసుకోవాలి. ఇందుకోసం క్యాల్షియం తగినంత ఉండే పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాలు, పెరుగు, చీజ్, క్యాబేజీ, బ్రొకోలీ, నట్స్, సీడ్స్ తీసుకోవాలి. 50 ఏళ్లు దాటిన వారు రోజు మొత్తం మీద 1000 నుంచి 2000 మిల్లీ గ్రాముల క్యాల్షియం అందేలా చూసుకోవాలి. అది సాధ్యం కాకపోతే వైద్యుల సూచనతో క్యాల్షియం సప్లిమెంట్ తీసుకోవచ్చు.

**విటమిన్ డీ**

క్యాల్షియం మన ఎముకలకు సరిగ్గా పట్టాలంటే అందుకు విటమిన్ డీ లోటు ఉండకూడదు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో సూర్యరశ్మి పడేలా చూసుకుంటే మన శరీరంలో విటమిన్ డీ తయారవుతుంది. చేపలు, గుడ్డు పచ్చసొన, డైరీ ఉత్పత్తుల్లోనూ విటమిన్ డీ ఉంటుంది.

**వ్యాయామాలు**

రోజువారీగా శారీరక వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఎముకలు బలంగా ఉంటాయి. నడక, జాగింగ్, డ్యాన్స్, బరువులు ఎత్తడం వంటి వన్నీ ఎముకల సామర్థ్యాన్ని పెంచుతాయి. రన్నింగ్, బ్రిస్క్ వాక్ కూడా చేసుకోవచ్చు.

**వీటికి దూరం**

పొగతాగే అలవాటు, మద్యపాన సేవనం కూడా ఎముకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. పొగతాగడం ఎముకల సాంద్రతను తగ్గిస్తుంది. మన శరీరం క్యాల్షియంను గ్రహించే సామర్థ్యాన్ని మద్యపానం దెబ్బతీస్తుంది.

**పరీక్షలు**

ఎముకల సాంద్రత ఏ మేరకు ఉందో చెప్పే బోన్ డెన్సిటీ టెస్టింగ్ చేయించుకోవాల్సి రావచ్చు. ఎక్స్ రే, స్కాన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా నష్టం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవచ్చు.

# ఈ అలవాట్లు ఉంటే.. మీకు కచ్చితంగా షుగర్ వస్తుంది



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఈ ఆధునికి యుగంలో మన ఆహారపు అలవాట్లు మనకు చాలా రోగాలను తెచ్చిపెడుతున్నాయి. అందులో ఎక్కువ మందికి డయాబెటిస్? సమస్య. చాలా మంది డయాబెటిస్ సమస్యతో బాధ పడుతున్నారు. అటువంటి వాళ్లు ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే మంచిది. ఎంత జాగ్రత్తగా ఉంటే ఆరోగ్యం అంత బాగుంటుంది. నిజంగా మనం తీసుకునే ఆహారాన్ని బట్టి మన ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సులో ఆహారపు అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి ఒక్కరి ఆహార అవసరాలు మరియు ప్రాధాన్యతలు భిన్నంగా ఉంటాయి ..మధుమేహం అదుపులో ఉండాలంటే పాటించవలసిన ఆహార నియమాలను ఇప్పుడు చూద్దాం. . .

**అధిక చక్కెర ఎంత హాని తెలుసా**

చక్కెర అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి ప్రయోజనకరమైన ఆహారాల వినియోగం తగ్గిపోతుంది. ఇవన్నీ శరీరానికి అవసరమైన కీలకమైన ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఇతర ముఖ్యమైన పోషకాలకు ముఖ్యమైన మూలాలు. అధిక చక్కెర వినియోగం టైప్ 2 మధుమేహం పెరుగుతుంది.

**ప్రాసెస్ చేయబడిన కార్బోహైడ్రేట్లు**

కార్బొహైడ్రేడ్లు శక్తిని ఇస్తాయి. వీటిని తక్కువ నీటితో జీర్ణం చేసుకోవచ్చు. తెల్ల రొట్టె, తెల్ల బియ్యం పాస్తా శుద్ధి చేసిన ధాన్యాలు సులభంగా జీర్ణమవుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతాయి.

**ఫైబర్ లేకపోవడం**

ఫైబర్ లేకపోవడం వల్ల, శరీరంలో అనేక రకాల సమస్యలు పెరుగుతాయి. ఎందుకంటే ఫైబర్ తగినంత మొత్తంలో తీసుకోకపోతే, ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలతో పాటు డయాబెటిక్ కూడా పెరుగుతుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు , చిక్కుడులో ఫైబర్ అధికంగా ఉంటుంది. డైటరీ ఫైబర్ లేని ఆహారం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థిరంగా ఉండదు, దీని వలన ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది . రక్తంలో చక్కెర స్థాయిలు ఫైబర్ ద్వారా బాగా నియంత్రించబడతాయి.

**అనారోగ్య కొవ్వులు**

కొవ్వు ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వృద్ధి చెందుతుంది. ప్రాసెస్ చేయబడిన , వేయించిన ఆహార పదార్థాలతో పాటు పాల ఉత్పత్తులలో అధిక కొవ్వు ఉంటుంది. వీటిని తీసుకోవం వల్ల ఊబకాయం పెరిగి.. ఇన్సులిన్ తగ్గుతుంది.

**అతిగా తినడం**

క్రమం తప్పకుండా అధికంగా తినడం వల్ల బరువు పెరుగుట మరియు ఊబకాయం ఏర్పడుతుంది., ఇది టైప్ 2 డయాబెటిస్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాలు.

**భోజనం వేళలు పాటించకపోవడం**

భోజన వేళలు కూడా పాటించాలి. ఆహారపు అలవాట్లు మారితే రక్తంలో చక్కెర నియంత్రణను దెబ్బతీస్తుంది.

మీరు ఆకలితో అలమటిస్తున్న సందర్భంలో మానసిక కల్లోలం మరియు చికాకు కలిగించే వైఖరి చాలా సాధారణం. మీ శరీరంలో బ్లడ్ షుగర్ స్థాయి తక్కువగా ఉండటం వల్ల, మీరు త్వరగా చికాకు పడతారు. మీరు దీన్ని అలవాటు చేసుకుంటే లక్షణాలు తీవ్రమవుతాయి. మీరు మరింత ఒత్తిడికి గురవుతారు మరియు నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటారు


**ఫాస్ట్ ఫుడ్స్**

ఫాస్ట్ ఫుడ్స్ తరచుగా తీసుకోవడం వల్ల బరువు పెరగడంతో పాటు , ఇన్సులిన్ తగ్గిపోతుంది. దీని వలన మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది, వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు, సోడియం అధికంగా ఉంటాయి.

**అధిక రక్తపోటుతో అధిక ముప్పు**

**పొగతాగడం, మద్యపానం అలవాట్లతోనూ నష్టమే**

**చురుకైన జీవనశైలితో సానుకూల ఫలితాలు**



# గుండెకు ఇవి పెద్ద శత్రువులు!

కరోనరీ హార్ట్ డిసీజ్ అనేది గుండె పోటుకు ఎక్కువగా కారణమవుతుంది. నిజానికి గుండె జబ్బులకు కారణం అయ్యే వాటి నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. చాలా మంది దీనిపై శ్రద్ధ లేక గుండె జబ్బులు పెరిగిపోయేలా చేసుకుంటారు. ఎక్కువ మందిలో గుండె జబ్బులకు కారణమవుతున్న ఐదు రిస్క్ అంశాలను పరిశీలించినట్టయితే..

**అధిక రక్తపోటు**

గుండె జబ్బులకు అధిక రక్తపోటు అతిపెద్ద ముప్పు కాగలదు. హార్ట్ ఎటాక్ బాధితులకు చికిత్స చేసే వైద్యులు చెప్పేది ఇదే. ధమనుల ద్వారా రక్తం ప్రవహించే సమయంలో పడే ఒత్తిడే రక్తపోటు. అధిక రక్తపోటు ఉంటే అది గుండె పైనే కాదు, మూత్రపిండాలు, మెదడు, ఇతర అవయాలపైనా చూపుతుంది. వైద్యులు సూచించిన ఔషధాలు తీసుకుంటూ, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో పెట్టుకోవచ్చు.

**ఆహారం**

అనారోగ్యానికి దారితీసే ఆహారానికి దూరంగా ఉండాలి. అధిక చక్కెరలు, సోడియం కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. ధమనుల గోడల్లో కొలెస్ట్రాల్ చేరిపోతుంది. రక్తనాళాల గోడలు కుచించుకుపోతాయి. దీంతో రక్త ప్రవాహం సాఫీగా సాగదు. ఫలితంగా హార్ట్ ఎటాక్ రిస్క్ పెరుగుతుంది.

**మద్యపానం**

రోజులో మూడు కంటే ఎక్కువ డ్రింక్ లు (ఆల్కహాల్/5 శాతం ఆల్కహాల్) తాగడం వల్ల కూడా హాని జరుగుతుంది. రక్తపోటు పెరుగుతుంది. దీనివల్ల గుండెపై ముప్పు పెరిగిపోతుంది. గుండె కండరాలపై ఒత్తిడి పడి గుండె జబ్బులకు కారణమవుతుంది.

**చలనం లేని జీవనం**

జీవనశైలి నిశ్చలంగా ఉండకూడదు. చురుగ్గా ఉండాలి. ఎలాంటి అనారోగ్యం లేకపోయినా సరే, శారీరక వ్యాయామం లోపించడం వల్ల గుండె జబ్బులకు దారితీస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్ సమస్యలు పలకరిస్తాయి.

**పొగతాగడం**

గుండెకు పొగతాడం కూడా ముప్పు తెచ్చి పెడుతుంది. సిగరెట్ లోని రసాయనాలు రక్తం మందమయ్యేలా చేస్తాయి. దీంతో క్లాట్స్ ఏర్పడతాయి. దీనివల్ల రక్త సరఫరా తగ్గుతుంది. దీంతో గుండె జబ్బుల రిస్క్ పెరిగిపోతుంది.

# క్రేజీ కాంబో షూటింగ్ పూర్తి.. త్వరలోనే అనౌన్స్‌మెంట్



కొన్ని కాంబినేషన్లకు ఉండే క్రేజ్, వాటికి ఉండే హైప్ వేరు. అయితే కొన్ని ఊహించని కాంబినేషన్లు కూడా చిత్ర పరిశ్రమలో ఆసక్తిని పెంచుతాయి. ఇప్పుడలాంటి కాంబినేషనే బాలీవుడ్ లో ఒకటి తెరకెక్కుతుంది. అదే రణ్‌వీర్ సింగ్, శ్రీలీల, బాబీ డియోల్ కలిసి చేస్తున్న సినిమా. వీరంతా కలిసి సినిమా చేయడంతో దీనికి సంబంధించిన అప్డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా అని అందరూ వెయిట్ చేస్తున్నారు.

**షూటింగ్ పూర్తి చేసుకున్న రణ్‌వీర్, శ్రీలీల మూవీ**


రణ్‌వీర్, శ్రీలీల కలిసి సినిమా చేస్తున్నారని వార్తలొచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై ఆడియన్స్ ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి లీకైన కొన్ని లుక్స్ మరియు సెట్ లో కొన్ని స్పష్టమైన ఫోటోలు ఆ ఆసక్తిని ఇంకాస్త పెంచగా, ఆ సినిమా గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది. రణ్‌వీర్, శ్రీలీల, బాబీ డియోల్ నటిస్తున్న ప్రాజెక్టుకు సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తైందని తెలుస్తోంది.

**వర్కవుట్ అయిన లీడ్ రోల్స్ కెమిస్ట్రీ**

సినిమాలో రణ్‌వీర్ మరియు శ్రీలీల మధ్య కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అవడంతో పాటూ సినిమాలో వారి పెయిర్ చాలా ఫ్రెష్ గా, ఎనర్జిటిక్ గా ఉందని, వారిద్దరి యాక్టింగ్ ఆడియన్స్ ను కచ్ఛితంగా ఆశ్చర్యపరుస్తుందని, వారంలోపే ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అనౌన్స్‌మెంట్ రానుందని అంటున్నారు. అయితే ఈ మూవీ టైటిల్ ఏంటనేది ఇంకా వెల్లడి కాలేదు.

**డిసెంబర్ 5న ధురంధర్ రిలీజ్**

ఈ ఇయర్ లో రానున్న మోస్ట్ ఎగ్జైటింగ్ ప్రాజెక్టుగా ఈ మూవీని నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తుండగా, సినిమాలో రణ్‌వీర్ స్క్రీన్ ప్రెజెన్స్, శ్రీలీల గ్లామర్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనున్నాయని సన్నిహిత వర్గాలంటున్నాయి. రణ్‌వీర్ సింగ్ ఓ వైపు ఈ ప్రాజెక్టు చేస్తూనే మరోవైపు ధురంధర్ అనే సినిమాను కూడా చేస్తున్నారు. రియల్ లైఫ్ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ధురంధర్ డిసెంబర్ 5న రిలీజ్ కానుండగా ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి.



## సమంత ఈజ్ బ్యాక్.. ఘనంగా ప్రారంభమైన షూటింగ్!



ఒకప్పుడు స్టార్ పొజిషన్ లో ఉన్న చాలామంది నటీమణులు కాలం మారుతున్న కొద్దీ ఇండస్ట్రీలకు కొత్త కొత్త నటీమణులు రావడంతో సీనియర్ లకి అవకాశాలు తగ్గిపోయి ఫేడౌట్ అయిపోతూ ఉంటారు. అలా ఇప్పటికే ఎంతోమంది సీనియర్ నటీమణులకు హీరోయిన్ గా అవకాశాలు తగ్గిపోయినప్పటికీ కీ రోల్స్, ఐటెం సాంగ్స్, స్పెషల్ పాత్రల్లో చేస్తూ సినిమాల్లో రాణిస్తున్నారు. కొంతమంది నటీమణులు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో చేస్తున్నారు. అయితే తాజాగా హీరోయిన్ సమంత చాలా రోజులకి తన కొత్త సినిమాని అనౌన్స్ చేసింది. తెలుగులో ఖుషి మూవీ తర్వాత మళ్లీ ఫుల్ లెంగ్త్ పాత్రలో సమంత కనిపించలేదు. ఈ ఏడాది సమంత నిర్మాతగా చేసిన శుభం మూవీలో కనిపించినప్పటికీ అది కేవలం అతిథి పాత్ర వరకే పరిమితమైంది. ప్రస్తుతం సమంతని ఫుల్ లెంగ్త్ పాత్రలో చూడడం కోసం ఆమె అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ఇలాంటి నేపథ్యంలో సమంతకు సంబంధించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ వార్త వైరల్ అవుతోంది. అదేంటంటే సమంత కొత్త సినిమాకు సంబంధించిన షూటింగ్ నిన్నటి నుండి ప్రారంభమైందట. సమంత ప్రస్తుతం తన సొంత బ్యానర్ అయినటువంటి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమా చేస్తున్న సంగతి మనకు తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడో అనౌన్స్ చేసినప్పటికీ ఇప్పటివరకు పట్టాలెక్కడం లేదు. అయితే రీసెంట్ గానే సమంత అక్టోబర్ లో తన కొత్త మూవీ అయినటువంటి మా ఇంటి బంగారం సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుందని చెప్పింది.

చెప్పినట్లుగానే మా ఇంటి బంగారం సినిమా షూటింగ్ నిన్నటి నుండి స్టార్ట్ చేశారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ హైదరాబాదులో నిన్నటి నుండి ప్రారంభమైంది.. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై వస్తున్న ఈ మూవీకి లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తోంది. అయితే ఈ సినిమా షూటింగ్ నిన్నటి నుండి స్టార్ట్ అవ్వడంతో ఈ సినిమాకి సంబంధించిన మిగతా అప్డేట్లు త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.. అలా కొత్త సినిమా షూటింగ్లో బిజీగా ఉన్న సమంత మొత్తానికైతే కం బ్యాక్ ఇచ్చేసిందని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా తాజాగా మరో విషయంతో కూడా సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో నిలిచింది సమంత..అదే దీపావళి సెలబ్రేషన్స్ ని తన రూమార్డ్ బాయ్ ఫ్రెండ్ గా పేరున్నటువంటి రాజ్ నిడిమోరు తో కలిసి చేసుకోవడమే.. కొద్ది రోజుల నుండి సమంత ఎక్కడికి వెళ్ళినా సరే రాజ్ నిడిమోరు తోనే కలిసి వెళుతుంది. వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నట్టు వార్తలు వినిపించినప్పటికీ సమంత మేనేజర్ ఈ వార్తల్ని ఖండించారు. కానీ వీరి మధ్య రిలేషన్ ఉందనే వార్తలకు బలం చేకూర్చేలా ప్రతిసారి వీరిద్దరూ ఎక్కడో ఒక దగ్గర అడ్డంగా బుక్ అవుతున్నారు. అలా తాజాగా సమంత ఈ ఏడాది దీపావళి సెలబ్రేషన్స్ ని తన రూమర్డ్ బాయ్ ఫ్రెండ్ రాజ్ నిడిమోరుతో కలిసి జరుపుకోవడమే కాకుండా వాటికి సంబంధించిన ఫోటోలను కూడా నెట్టింట షేర్ చేయడంతో ఈ ఫొటోస్ కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి కొత్త సినిమా గుడ్ న్యూస్ చెప్పినట్టే సమంత రెండో పెళ్లికి సంబంధించిన గుడ్ న్యూస్ కూడా త్వరలోనే చెబుతుందా అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.